సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025




కౌలుకోలేక..
పొగాకు భూముల కౌలు, బ్యారన్ల లీజులు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో కౌలుకు తీసుకుని సాగు చేసే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

8లో



మోటారు సైకిళ్ల దొంగ అరెస్ట్
మోటారు సైకిళ్లను దొంగిలిస్తున్న 20 ఏళ్ల యువకుడిని సర్పవరం పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 11 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.

మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం రాత్రి 5,47,004 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.20 అడుగులకు చేరుకుంది. డెల్టా కాలువలకు 10,300 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు.

న్యూస్‌రీల్

సృజనాత్మకత వెలికితీసేందుకే వారధి పోటీలు


విజేతలకు బహుమతులు అందజేసిన డీఈవో బాషా తదితరులు

అమలాపురం టౌన్: విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంచేందుకు, సృజనాత్మకత వెలికి తీసేందుకే వారికి వారధి పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషా అన్నారు. అమలాపురంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన వారధి పోటీలను బాషా మంగళవారం ప్రారంభించి ప్రసంగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భమిడిపాటి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభకు డీఈవో బాషా, జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జి.మమ్మీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సమగ్ర శిక్షా కో ఆర్డినేటర్ మమ్మీ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ ఇలాంటి పోటీల వల్ల బయటకు వస్తాయని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీల తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఆర్.వెంకటేశ్వరరావు, ఏవీఎల్ నరసింహారావు, పీవీఎల్ఎన్ శ్రీరామ్, కాలే దుర్గాభవాని, ఉదయ శంకర్, సీహెచ్ఎల్‌జీ నరసింహారావు, జి.సీతారామలక్ష్మి, ఎస్.బాబు వ్యవహరించారు.

ప్రలోభాలకు లొంగలేదన్న కక్షతోనే ఆరోపణలు


విలేకరులతో మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు బులినాని, మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ నుంచి కౌన్సిలర్‌గా నెగ్గిన మీ తల్లిని మున్సిపల్ చైర్‌పర్సన్ చేయడం కోసం మా పార్టీ కౌన్సిలర్లను ప్రలోభపెట్టిన మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇప్పుడు మా పార్టీ కౌన్సిలర్లు, నాయకులు అవినీతిపరులని ఆరోపించడం విడ్డూరంగా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు ముకుమ్మడిగా ధ్వజమెత్తారు. స్థానిక వాసర్ల గార్డెన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర తదితరులు మాట్లాడారు. మంత్రి సుభాష్ పార్టీ కౌన్సిలర్లను రూ.లక్షల్లో బేరం ఆడడమే కాకుండా విల్లాలు ఇస్తానని ప్రలోభపెట్టారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఈ ప్రలోభాలకు లొంగలేదన్న కక్షతో నేడు పార్టీపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని ఎదురు దాడికి దిగారు. అమలాపురం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన రూ.కోటి అవినీతిలో తనకు సంబంధం ఉందని, విచారణ చేయిస్తానని మంత్రి అనడం హాస్యాస్పదంగా ఉందని పట్టణ పార్టీ అధ్యక్షుడు బులినాని అన్నారు. ఇందులో తనకు, తన కుటుంబానికి సంబంధం ఉందని మంత్రి రుజువు చేస్తే నీ చెప్పు నా మెడలో వేసుకుంటాను, రుజువు చేయకపోతే నా చెప్పు నీ మెడలో వేసుకోవాలని బులినాని మంత్రి సుభాష్‌కు సవాల్ విసిరారు. మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, చిత్రపు రామకృష్ణ, పార్టీ నాయకులు కుడుపూడి భరత్‌భూషణ్, కట్టోజు రాము, విత్తనాల మూర్తి, దొంగ చిన్నా, వాసర్ల సుబ్బారావు తదితరులు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పేరుతో కుట్ర


సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకర్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని మాల మహానాడు అండ్ రాక్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై దేశవ్యాప్తంగా అతి పెద్ద రాజకీయ కుట్ర చేస్తున్నారన్నారు. నిజానికి ఎస్సీ వర్గీకరణతో వంద మందిలో నలుగురికే లబ్ధి చేకూరుతుందన్నారు. చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలు ఎస్సీ వర్గీకరణ సామాజిక న్యాయం అంటున్నారని, అయితే తెలుగు రాష్ట్రాలలో ముఖ్యమంత్రి పదవులను ఎస్సీలకు ఇవ్వగలరా అని ప్రశ్నించారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

ప్రజలకు వాస్తవాలను తెలిపే పత్రికలపై కూటమి ప్రభుత్వం కేసులు పెట్టడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ప్రభుత్వాలు శాశ్వతం కాదు. పత్రికా స్వేచ్ఛను హరిస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదం తలెత్తుతుంది. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయ్‌రెడ్డి, ఇతర పాత్రికేయులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి.

– కుడుపూడి పార్థసారథి, అధ్యక్షుడు, ది.రాజమండ్రి ప్రెస్‌క్లబ్





కేసులు పెట్టడం సరికాదు

అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే ప్రజావ్యతిరేకత మూటకట్టుకున్న కూటమి ప్రభుత్వం ప్రశ్నించే గొంతులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ప్రభుత్వంలోని లోటుపాట్లను ఎత్తిచూపిన వారిపై కేసులు నమోదు చేయడం సరికాదు. వెంటనే సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయ్‌రెడ్డి, పాత్రికేయులపై నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలి.

– విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ చైర్మన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా



జల జీవనం


పి.గన్నవరం మండలం బూరుగులంక రేవు వద్ద పడవపై వస్తున్న లంక గ్రామాల ప్రజలు

కోనసీమ లంక గ్రామాల ప్రజలను వరద, భారీ వర్షాలు ఏడాది కాలంగా ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. వర్షాలు ఇప్పటివరకు కాస్త తక్కువగానే ఉన్నా గడచిన మూడు రోజుల నుంచి అడపాదడపా వర్షం కురుస్తూనే ఉంది. మరోపక్క గోదావరికి నాలుగోసారి వరదలు వచ్చాయి. ఇలా ఒకేసారి వరద, భారీ వర్షాలు లంకవాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

- ఓ పక్క భారీ వర్షాలు.. మరో పక్క వరదలు
- గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో బెంబేలు

సాక్షి, అమలాపురం: గడచిన మూడు రోజులుగా కరువు తీరా వర్షం పడుతోంది. అయినా కోనసీమ జిల్లాలో ఇంకా లోటు వర్షమే. మరోవైపు గోదావరికి వరద పెరుగుతోంది. ఈ సీజన్‌లో ఇది నాల్గవ వరద కాగా, ఈ నెలలో ఇది రెండోసారి. అయితే లంక గ్రామాలను ముంచే స్థాయిలో వరద వచ్చే అవకాశం లేదని సాగునీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం ఎనిమిది గంటల వరకు జిల్లా వ్యాప్తంగా సగటు 10.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా కపిలేశ్వరపురం మండలంలో 45.2 మిల్లీమీటర్ల వర్షం కురవగా, ఉప్పలగుప్తం మండలంలో 2.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. తరువాత నుంచి వర్షం కుంభవృష్టిని తలపించింది. ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దఫదఫాలుగా భారీ వర్షం కురిసింది. జిల్లాలో అమలాపురం, అంబాజీపేట, కొత్తపేట, పి.గన్నవరం, ఆలమూరు, కొత్తపేట, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల్లో ఉదయం రెండు, మూడు గంటల పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో పలుచోట్ల చీకటి వాతావరణాన్ని తలపించింది. ఉరుములు, మెరుపులతో ఏకధాటిగా కురిసిన వర్షంతో సామాన్యుల జీవనం అస్తవ్యస్తంగా మారింది. చిరు వ్యాపారులు దుకాణాలు మూసివేశారు. పలుచోట్ల రోడ్ల మీదకు నీరు చేరింది. జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలో ఈదరపల్లి, హౌసింగ్ బోర్డు కాలనీ వంటి ప్రాంతాల్లో రోడ్లపై నీరు ప్రవహించింది. లోతట్టు కాలనీల్లో ముంపునీరు చేరింది. గోతుల రోడ్లల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. వర్షం వల్ల వరి రైతులు కలవరపడ్డారు. ఉప్పలగుప్తం, అల్లవరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లోని శివారు చేలల్లో మోకాలి లోతు నీరు చేరింది. మధ్యాహ్నం తెరిపినివ్వడంతో రైతులు కొంత వరకు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఉద్యాన పంటల రైతులకు ఈ వర్షాలు కొంత మేర ఊరటనిస్తున్నాయి. ముఖ్యంగా డెల్టాలోని కొబ్బరి, అరటి, ఆయిల్‌పామ్, కోకో, బొప్పాయి, పోక, కూరగాయ పంటలకు వర్షం మేలు చేస్తోంది. సెప్టెంబరు నెలలో కూడా వేసవిని తలపిస్తున్న ఎండల వల్ల ఉద్యాన పంటలు తలలు వాల్చేస్తున్న సమయంలో మూడురోజుల పాటు ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురవడం రైతులకు ఊరటనిస్తోంది. జూన్ ఒకటో తేదీ నుంచి సెప్టెంబరు 16వ తేదీ వరకు జిల్లాలో ప్రతి మండలంలోనూ లోటు వర్షం నమోదయింది.


అంబాజీపేటలో భారీ వర్షం

ఆయా మండలాల్లో లోటు వర్షపాత శాతం ఇలా..
ఆత్రేయపురం (18.3), మండపేట 50.8, రాయవరం 51.3, రామచంద్రపురం 15.6, ఆలమూరు 4.3, రావులపాలెం 21.1, కొత్తపేట 17.2, కపిలేశ్వరపురం 41.1, కె.గంగవరం 24.3, ఐ.పోలవరం 31.2, ముమ్మిడివరం 21.6, అయినవిల్లి 20.7, పి.గన్నవరం 31.4, అంబాజీపేట 30.6, మామిడికుదురు 28.2, రాజోలు 34.2, మలికిపురం 9.2, సఖినేటిపల్లి 53.1, అల్లవరం 26.5, అమలాపురం 30.3, ఉప్పలగుప్తం 32.1, కాట్రేనికోన 46 శాతం లోటు వర్షపాతం నమోదయింది.

స్వల్పంగా పెరిగిన వరద
గోదావరికి మరోసారి వరద తాకింది. అయితే దీని ప్రభావం స్వల్పమే. మంగళవారం ఉదయం ఆరు గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు 5,84,069 క్యూసెక్కులను విడుదల చేశారు. బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో 5,95,169 క్యూసెక్కులు కాగా, తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,500 క్యూసెక్కుల చొప్పున మూడు డెల్టాలకు కలిపి మొత్తం 11,100 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. సాయంత్రం ఆరు గంటల సమయానికి వరద 5,47,004 క్యూసెక్కులకు చేరింది. ఎగువ గోదావరి పరివాహక ప్రాంతాల్లో శని, ఆది, సోమవారాల్లో పెద్దగా వర్షాలు పడలేదు. మరో లక్ష క్యూసెక్కులకు వరద పెరిగి తరువాత తగ్గుతుందని సాగునీటి పారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది భారీ వరదలు లేకున్నా సెప్టెంబరు నెలలో ఇది రెండోసారి వరద కావడం విశేషం. దీని వల్ల ఈ ఏడాది ఇన్‌ఫ్లోలు పెరిగాయి. గోదావరికి ఈ సీజన్‌లో మంగళవారం ఉదయం ఆరు గంటల వరకు 2,904.4 టీఎంసీల నమోదు కావడం కొంత వరకు ఊరటనిచ్చింది. ఆగస్టు నెలలో వరద ఒరవడి లేక రబీ పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన చెందారు.

నైరుతిలో జిల్లాలో నెలల వారీగా వర్షపాతం

నెల	సాధారణ వర్షపాతం	కురిసిన వర్షం	అధికం/లోటు శాతం
జూన్	111.4	105.9	– 4.9
జూలై	241	112.2	– 53.2
ఆగస్టు	229.7	203.5	– 11.4
సెప్టెంబరు (16వ తేదీ వరకు)	84.3	49.1	– 41.8
మొత్తం ఇప్పటివరకు	666.4	470.7	– 29.4

రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్


పెన్‌డౌన్ ఆందోళనపై చర్చిస్తున్న దస్తావేజు లేఖర్లు

19, 20 తేదీల్లో ఆందోళనకు సిద్ధం

అమలాపురం టౌన్: ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన లోప భూయిష్టమైన 2.0 విధానం వల్ల ప్రజలకు, దస్తావేజు లేఖర్లకు విపరీమైన అసౌకర్యం, ఇబ్బంది కలుగుతోందని దస్తావేజు లేఖర్లు ఆందోళన బాట పడుతున్నారు. ఈనెల 19, 20 తేదీల్లో రెండు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ చేసి ఆందోళనకు దిగుతున్నారు. అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని దస్తావేజు లేఖర్లు మంగళవారం సమావేశమై ఈ ఆందోళనపై చర్చించారు. ఈ విధానంలో ఓటీపీలు బహిర్గతం చేసేందుకు ప్రజలు సంకోచిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఆటో మ్యుటేషన్ సిస్టమ్‌ను తాము స్వాగతిస్తున్నా డిపార్ట్‌మెంట్‌లో సమన్వయ లోపం వల్ల చాలా ఇబ్బందులు అనివార్యమవుతున్నాయని దస్తావేజు లేఖర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ లోపాలను సరిదిద్దాలని వారు డిమాండు చేశారు. ఈ రెండు రోజుల్లో తాము పెన్‌డౌన్ చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని సమావేశం తీర్మానించింది. ఈ రెండు రోజుల్లో అమలాపురం దస్తావేజు లేఖర్లు తమ (డీడబ్ల్యూఎస్)లను మూసివేసి నిరసన కార్యక్రమాల్లో పాల్గొవాలని సమావేశం పిలుపునిచ్చింది. నిరసన అనంతరం జిల్లా కలెక్టర్‌కు తమ డిమాండ్లతో వినతిపత్రం ఇవ్వనున్నట్లు దస్తావేజు లేఖర్లు తెలిపారు. సమావేశంలో అమలాపురం దస్తావేజు లేఖర్ల సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సంఘం గౌరవాధ్యక్షుడిగా గుంటు ఫణిప్రసాద్, అధ్యక్షుడిగా జిన్నూరి సురేష్, ఉపాధ్యక్షుడిగా వెణుతురుపల్లి సుబ్బు, కార్యదర్శిగా పందిరి హరి, కోశాధికారిగా గుమ్మళ్ల నరేష్, సంయుక్త కార్యదర్శిగా దుర్గేష్ ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని సంఘ ప్రతినిధి మట్టపర్తి రాము తదితరులు అభినందించారు.

కొబ్బరి చెక్కల వేలం రూ.7.06 లక్షలకు ఖరారు

పెరవలి: అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో (2025–26) ఏడాది కాలానికి కొబ్బరి చెక్కలు పోగుచేసుకునేందుకు రూ.7.06 లక్షలకు వేలం ఖరారైంది. అలాగే తలనీలాలు తీసుకునేందుకు రూ.71 వేలకు పాడుకున్నారు. ఆలయ ఆవరణలో అధికారుల సమక్షంలో మంగళవారం ఈ వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ మొదటి ఏడాది ఈ విధంగా ఉండగా, 2026 – 27లో ప్రస్తుతం పాడిన పాటపై 10 శాతం పెంచి సొమ్ములు కట్టించుకుంటామన్నారు. దీని ద్వారా వచ్చే ఏడాది రూ.7,76,600 వస్తుందన్నారు. ఈ వేలం పాటలో గత ఏడాది కంటే రూ.2,73,500 ఎక్కువ ఆదాయం వచ్చిందన్నారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారి జి.సత్యప్రసాద్ నేతృత్వంలో గ్రామ పెద్దలు రంగినీడి కట్లయ్య, బొలిశెట్టి ప్రసాద్ తదితరుల సమక్షంలో వేలం నిర్వహించారు.


కొబ్బరి చెక్కల వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్న రైతులు

- ఏడాది కాలంలో 24 మంది రైతుల ఆత్మహత్యలు
- వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రామారావు


విలేకరులతో మాట్లాడుతున్న జున్నూరి రామారావు తదితరులు

అల్లవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలో పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకోలేక రైతులు అత్యంత దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జున్నూరి రామారావు (బాబీ) అన్నారు. అల్లవరం మండలం డి.రావులపాలెంలోని ఆయన నివాసంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గిట్టుబాటు ధర లేక పంటను రోడ్ల పక్కన పారవేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. కర్నూలు, కడప జిల్లాలో ఉల్లి కేవలం కిలో రూ.3, టమాటా రూ.1.50కు దక్కే పరిస్థితి ఉందన్నారు. ఈ రేటుతో రైతులకు కూలీ ఖర్చులు వస్తాయా.. అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బత్తాయి, అరటి, పొగాకు, వరి తదితర పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఉల్లికి మద్దతు ధర లేక అనంతపురం జిల్లాలో కౌలు రైతు కురవా రామచంద్రుడు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఇదే జిల్లాలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడడంతో ఆయన కుటుంబం రోడ్డున పడిందని తెలిపారు. పల్నాడు జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో 24 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని బీబీసీ చానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ జిల్లా వ్యవసాయాధికారి చెప్పారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాళ్వా పంట ధాన్యం డబ్బు రైతులకు జమ అయ్యేంత వరకు పోరాటం చేసి రైతులకు అండగా నిలిచారని తెలిపారు. యూరియా కోసం రోడ్కెక్కిన రైతులకు బాసటగా వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తేనే గాని ఈ ప్రభుత్వం స్పందించలేదన్నారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జున్నూరి వెంకటేశ్వరరావు, అమలాపురం నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కాండ్రేగుల జవహర్ తదితరులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రం ఆడపడుచులు!



- పక్షులంటే ఒప్పుకోని ప్రజలు
- ఏటా తగ్గుతున్న వలస పక్షుల సంఖ్య
- పైసా ఖర్చుచేయని అటవీ శాఖ
- మృత్యుపాశాలుగా హెచ్‌టీ లైన్లు

రాజానగరం: ఏటా వలస పక్షుల ప్రస్తావన వచ్చినపుడల్లా ఠక్కున గుర్తొచ్చేవి స్థానిక 'పుణ్యక్షేత్రం' ఆడపడుచులే. అవునండీ.. తూర్పుగోదావరి జిల్లాలోని ఈ 'పుణ్యక్షేత్రం' గ్రామానికి వచ్చే పక్షులను ఆ ఊరి ప్రజలు తమ ఆడపడుచుల్లా ఆదరిస్తారు. రాజమహేంద్రవరం సమీపాన ఉన్న ఈ గ్రామానికి విహంగాల వల్లే 'పుణ్యక్షేత్రం' అనే పేరు వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. అయితే గతంతో పోలిస్తే ఇక్కడకు వచ్చే పక్షుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఇందుకు ఊళ్లో ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్లూ ఓ కారణమే. ఈ పక్షులు ఆవాసంగా ఎంచుకున్న కంచి విత్తనం చెట్లను ఆనుకున్న 33 కేవీ విద్యుత్ లైన్లు వాటి పాలిట మృత్యుపాశాలుగా మారాయి. అవి గాల్లోకి ఎగిరే సమయంలో రెక్కలు ఆ తీగలకు తగిలి అంతలోనే నేలరాలుతున్నాయి.

ఖండాంతరాలు దాటి..
ఆసియా ఖండపు ఉత్తర ప్రాంతం రష్యాలోని సైబీరియా నుంచి ఏటా క్రమం తప్పకుండా వచ్చే ఈ పక్షులను ×సైబీరియన్ క్రేన్స్‌® అంటారు. రష్యాలోని ఆర్కిటిక్ టండ్రాలో తూర్పు, పశ్చిమ జాతులుగా ఉన్న ఈ పక్షులు సంతానోత్పత్తి కోసం తూర్పు జాతులు చైనాకు, పశ్చిమ జాతులు భారత్ వైపు వలస వెళతాయి.

మృగశిర కార్తెలో రాక
తొలకరి పడే సమయం(మృగశిర కార్తె)లో వలస వచ్చి, మాఘమాసంలో స్వస్థలాలకు తిరిగి వెళ్లే ఈ పక్షులను స్థానికులు చిల్లు ముక్కు కొంగలు, నత్త కొట్లు, ఓపెన్ బిల్ బర్డ్స్ అని పిలుస్తారు. వీటి రాకతో తొలకరి పనులు ప్రారంభిస్తుంటారు. అవి రాకుంటే తొలకరి సాగదేమోనని ఆందోళన చెందుతారంటే వాటితో అనుబంధాన్ని అర్థం చేసుకోవచ్చు. తాతముత్తాతల కాలం నుంచి వలస వచ్చే ఈ పక్షులను పుణ్యక్షేత్రం వాసులు పుట్టింటికి వచ్చే ఆడపడుచుల్లా ఆదరిస్తారు. ఇక్కడే సంతానోత్పత్తి చేస్తాయి కాబట్టి అవి తమ ఆడపడుచులని అక్కడివారంతా అంటుంటారు. పొలాల్లో నత్తలను, పురుగులను తింటూ తమకు సాయపడుతుంటాయని రైతులు చెబుతున్నారు.

ఊరి చెరువు గట్టే ఆవాసం
గ్రామంలోని ఊరి చెరువు గట్టే వీటికి ఆవాసం. ఈ గట్టు చుట్టూ విస్తారంగా పెరిగిన కంచి చెట్లపై గూళ్లు పెట్టుకుని, సంతానోత్పత్తి చేసుకుంటాయి.

కానరాని ప్రభుత్వ చర్యలు



ఈ పక్షులు ఎంతకాలం నుంచి ఇక్కడకు వస్తున్నాయో ఎవరికీ తెలియదు. వీటి సంరక్షణకు అటవీ శాఖ ఏ విధమైన చర్యలూ తీసుకోలేదు. టూరిజం స్పాట్ అంటూ బోర్డులైతే పెట్టారు కానీ ఒక్క రూపాయి ఖర్చు చేసింది లేదు. నాయకులు, అధికారులు ఎందరో వస్తుంటారు. కోట్లు కేటాయించి, సంరక్షణకు ఏర్పాట్లు చేస్తామంటూ ప్రగల్భాలు పలికే వారే గానీ పనులు చేసేవారు మాత్రం లేరు. దీంతో వీటి సంరక్షణ కాగితాలకే పరిమితమైంది.

– ఎం.వెంకటేశ్వరరావు, సర్పంచ్, పుణ్యక్షేత్రం


కంచి విత్తనం చెట్లపై పక్షుల ఆవాసం

కౌలు కోలేక..

- దూసుకుపోతున్న పొగాకు ధరలు
- వచ్చే ఏడాది లీజులపై పడనున్న పెరుగుదల
- ఎకరాకు కౌలు రూ.80 వేలు
- బ్యారన్ల లీజుకు రెక్కలు
- లబోదిబో మంటున్న కౌలు రైతులు



జీడిమామిడి తోటలను తొలగించి సామిల్లుకు తరలిస్తున్న కలప



దేవరపల్లి మండలం బందపురంలోని పొగాకు సాగుచేయనున్న భూమి

దేవరపల్లి: పొగాకు ధరలు రోజురోజుకూ అంచనాలకు అందని రీతిలో పెరుగుతున్నాయి. రైతులు మునుపెన్నడూ ఊహించని విధంగా కిలోకు గరిష్టంగా రూ.430కి లభిస్తోంది. ఈ ధర ఇటు రైతులు.. అటు కౌలు రైతులకు కాసులు కురిపిస్తోంది. ఈ పరిస్థితి ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్టు.. ఈ ప్రభావం 2025–26 ఏడాది సాగుపై పడనుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకుకు డిమాండ్ పెరగడంతో భూ యజమానులు వారి భూముల కౌలు, బ్యారన్ల లీజులు, బ్యారన్ల లైసెన్సు ధరలను అమాంతం పెంచేశారు. దీంతో రానున్న ఏడాదికి సాగుచేసే కౌలు రైతులపై ఈ ప్రభావం తీవ్రంగా పడనుంది. గత ఏడాదితో పోల్చుకుంటే భూముల కౌలు స్వల్పంగా పెరిగినప్పటికీ బ్యారన్ల లీజు, లైసెన్సు ధర పెరగడమే ఇందుకు కారణం. పొగాకు సాగు చేసే రైతుల్లో 80 శాతం కౌలుదారులే ఉన్నారు. కౌలు భూములు, లీజు బ్యారన్లు ఇప్పటి నుంచే కౌలు రైతులు హడావుడి పడుతున్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు భూములను కౌలుకు, బ్యారన్లను లీజుకు తీసుకుని సిద్ధమవుతున్నారు. జీడిమామిడి, మామిడి, కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటలను తొలగించి పొగాకు సాగు చేయడానికి భూములను సిద్ధం చేస్తున్నారు. ఎకరం కొబ్బరితోటపై ఆదాయం రూ.30 వేలు, జీడిమామిడి తోటపై రూ.20 వేలు, ఆయిల్‌పామ్ పంటపై రూ.50 వేలకు మించి ఆదాయం రావడం లేదని, భూములను కౌలుకు ఇస్తే శ్రమ లేకుండా ఎకరాకు రూ.70 నుంచి 80 వేలు వస్తోందని రైతులు అంటున్నారు. పెద్ద రైతులంతా పొగాకు వ్యవసాయానికి స్వస్తి చెప్పి బ్యారన్లను లీజుకు ఇచ్చి భూముల్లో ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారు. ఉద్యాన పంటల్లో అంతర పంటల ద్వారా అధిక ఆదాయం పొందుతున్నారు.

గణనీయంగా పెరగనున్న సాగు

2025–26 సంవత్సరానికి జిల్లాలో పొగాకు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. 2024–25 పంట సీజన్‌లో రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని దేవరపల్లి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం వేలం కేంద్రాల పరిధిలో సుమారు 29 వేల హెక్టార్లలో పంట సాగు చేశారు. 2023–24 ఏడాదిలో తూర్పు, ఏలూరు జిల్లాల్లోని ఐదు వేలం కేంద్రాల పరిధిలో సుమారు 27 వేల హెక్టార్లలో పంట సాగు చేసినట్టు అధికారులు తెలిపారు. బోర్డు అనుమతించిన దానికంటే అదనంగా సుమారు 20 నుంచి 25 వేల ఎకరాల్లో పంట సాగు చేసినట్టు అధికారులు లెక్కలు వేస్తున్నారు. 2023–24 సీజన్‌లో 58.25 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, 80 మిలియన్ కిలోలు పండించారు. 2024–25 సీజన్‌లో 49 మిలియన్ కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వగా 67 మిలియన్ కిలోలు ఉత్పత్తి జరిగింది. బోర్డు ఎన్ని నిబంధనలు విధించినా వచ్చే ఏడాది 100 మిలియన్ల పంట ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నారు.

బ్యారన్ లైసెన్స్ ధర రూ.10.50 లక్షలు

మార్కెట్లో పొగాకు ధర అనూహ్యంగా పెరగడంతో బ్యారన్ లైసెన్సు ధర రైతులకు అందుబాటులో లేకుండా పోయింది. 2022లో బ్యారన్ లైసెన్సు ధర రూ.2.60 లక్షలు, 2023లో రూ.4 లక్షలు ఉండగా, 2024–25లో రూ.10.50 లక్షలు, ప్రస్తుతం రూ.10.50 లక్షలు పలుకుతోంది. గతంలో బ్యారన్లు అమ్ముకున్న రైతులు ప్రస్తుత ధరను చూసి లబోదిబో మంటున్నారు. గత ఏడాది బ్యారన్ లీజు రూ.60 నుంచి 70 వేలు ఉండగా, ఈ ఏడాది రూ.1.70 లక్షలు పలికింది. ప్రస్తుతం రూ.2.10 లక్షలు పలుకుతుందని రైతులు తెలిపారు. గత రెండేళ్ల క్రితం బ్యారన్ ఖరీదు ప్రస్తుతం అద్దె పలుకుతుందని రైతులు తెలిపారు.

రెట్టింపు పలుకుతున్న కౌలు

సాగు భూమి కౌలు ధర రెట్టింపు పలుకుతుంది. గత ఏడాది ప్రాంతాన్ని బట్టి కౌలు ధర పలుకుతుంది. గోపాలపురం మండలం వాదాలకుంట, వెదుళ్లకుంట గ్రామాల్లో ఎకరం కౌలు రూ.80 వేలు పలుకుతుండగా, దేవరపల్లి మండలం చిన్నాయగూడెం, సంగాయగూడెం, యర్నగూడెం గ్రామాల్లో రూ.75 వేలు, దేవరపల్లిలో రూ.70 వేలు కౌలు ధర పలుకుతుందని రైతులు తెలిపారు. పల్లంట్ల, కురుకూరు, లక్ష్మీపురం గ్రామాల్లో నల్లరేగడి భూముల కౌలు రూ.70 వేలు పలుకుతున్నట్టు రైతులు తెలిపారు. 2022లో ఎకరా కౌలు రూ.25 వేల నుంచి 30 వేలు ఉండగా, 2023–24లో రూ.35 వేల నుంచి 42 వేలు పలికింది. 2024–25లో రూ.60 నుంచి 70 వేలు పలికిన కౌలు ప్రస్తుతం రూ.70 నుంచి 80 వేలు పలుకుతున్నాయని కౌలు రైతులు వాపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై ధర్మవరం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానిక పోలీసుల కథనం మేరకు తొండంగి మండలం పెరుమాళ్లపురం గ్రామ పరిధిలోని కడారి పేటకు చెందిన కడారి నాగేశ్వరరావు (39), మరో వ్యక్తి నేమాల శ్రీనుతో కలసి స్కూటీపై బయలుదేరారు. కిర్లంపూడి మండలం వేలంకలోని చేపల చెరువుకు గస్తీగా ఉండేందుకు వెళ్తుండగా ధర్మవరం వద్ద కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఆగారు. వారి వెనుకనే రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కంటైనర్ కడారి నాగేశ్వరరావును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. నేమాల శ్రీను ఇచ్చిన ఫిర్యాదుపై స్థానిక ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి 6 నెలల జైలు

పిఠాపురం: పిఠాపురంలో ఒక చెక్ బౌన్స్ కేసులో కింది కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ మంగళవారం 12వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. తీర్పు ప్రకారంగా నిందితుడికి 6 నెలల జైలు శిక్ష, అప్పు సొమ్ము చెల్లించకపోతే మరో మూడు నెలల జైలు శిక్షను ఖరారు చేశారు. పిఠాపురం నియోజకవర్గంలోని నాగులాపల్లి గ్రామానికి చెందిన కూతా ప్రకాష్‌రెడ్డి, పిఠాపురం పట్టణ వాసి గన్నేరు ఈశ్వరరావు వద్ద రూ.3,85,000 అప్పుగా తీసుకున్నాడు. దీనిపై అతడు ఇచ్చిన చెక్ బౌన్స్ కావడంతో ఈశ్వరరావు 2019లో కోర్టులో కేసు వేశారు. దీనిపై 2022లో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కూతా ప్రకాష్‌రెడ్డికి 6 నెలల జైలు శిక్ష, అప్పు చెల్లించని పక్షంలో మరో మూడు నెలల జైలు శిక్షను ఖరారు చేశారు. దీనిపై ప్రకాష్‌రెడ్డి అదనపు జిల్లా కోర్టుకు అప్పీలు చేసుకోగా, తాజాగా అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీ హరి మంగళవారం కింది కోర్టు తీర్పును సమర్థిస్తూ అదే శిక్షను ఖరారు చేశారు. ఫిర్యాది తరఫున బీవీవీ సత్యనారాయణరాజు వాదించారు.

పంట కాలువలో గూడ్స్ వాహనం బోల్తా



మొండెపులంక వద్ద పంట కాలువలో పడిపోయిన వ్యాన్

ప్రాణాలతో బయటపడ్డ ఐదుగురు జట్టు కార్మికులు

పి.గన్నవరం: రాజవరం–పొదలాడ రోడ్డులో మొండెపులంక గ్రామం వద్ద మంగళవారం సాయంత్రం జట్టు కార్మికులతో వెళ్తున్న గూడ్స్ వ్యాన్ అదుపుతప్పి పంట కాలువలో పడిపోయింది. ప్రమాదం నుంచి వ్యాన్‌లో ఉన్న ఐదుగురు జట్టు కార్మికులు సురక్షితంగా బయట పడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పలివెల గ్రామానికి చెందిన జట్టు కార్మికులు మంగళవారం జగ్గన్నపేటలో ఇంటికి శ్లాబు వేశారు. శ్లాబు పనులు ముగిసిన అనంతరం సంబంధిత సామాన్లు, మిల్లర్‌తో సహా వ్యాన్‌లో పలివెల గ్రామానికి తిరిగి వెళ్తున్నారు. వారు ప్రయాణిస్తున్న వ్యాన్ మొండెపులంక వద్ద కుడివైపున ఉన్న పంట కాలువలో పడిపోయింది. దీనిని గమనించిన స్థానికులు వ్యాన్‌లో ఉన్న వారిని బయటకు తీసారు. వ్యాన్‌లో ఉన్న వైబ్రేటర్లు, ఇతర సామాన్లు నీట మునిగాయి. ప్రమాదం నుంచి బయటపడ్డ కార్మికులకు స్థానికులు సహాయం అందించారు. రోడ్డుకు ఎడమవైపు ఉన్న ప్రధాన పంట కాలువలోకి వ్యాన్ పడిపోయి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు వివరించారు.

క్లుప్తంగా

రైఫిల్ షూటింగ్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు రిషిత



యడ్ల రిషిత

రాజోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు శివకోటి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని యడ్ల రిషిత అర్హత సాధించిందని ప్రధానోపాధ్యాయుడు ఎస్.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. కాకినాడలో జరిగిన జిల్లాస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో రిషిత ప్రతిభ చూపింది. సర్పంచ్ నక్కా రామారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు చొప్పల చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

జేవీవీ రాష్ట్ర పర్యావరణ కమిటీ కన్వీనర్ల ఎంపిక



కేవీవీ సత్యనారాయణ



చిలుకూరి శ్రీనివాసరావు



జి.సుధాకర్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం)/కడియం: జన విజ్ఞాన వేదిక(జేవీవీ) రాష్ట్ర పర్యావరణ కమిటీ ముగ్గురు సభ్యుల బృందాన్ని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.లక్ష్మణరావు, టి.సురేష్ మంగళవారం ప్రకటించారు. కోనసీమ జిల్లా నుంచి కన్వీనర్‌గా కేవీవీ.సత్యనారాయణ, కో కన్వీనర్లుగా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన చిలుకూరి శ్రీనివాసరావు, చిత్తూరు జిల్లాకు చెందిన జి.సుధాకర్‌లను ఎంపిక చేశారు. ఎంపికైన ముగ్గురూ జనవిజ్ఞాన వేదికలో గత మూడు దశాబ్దాలుగా వివిధ కేడర్లలో విశేషమైన సేవలు అందించారు.

గర్జించే సింహం కన్నా గాయపడినది ఇంకా ప్రమాదకరం

- జగనన్న 2.0 చూడబోతున్నారు
- ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకాణి



మీడియాతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): గర్జించే సింహం కన్నా గాయపడ్డ సింహమే ప్రమాదకరమని చంద్రబాబు గుర్తించుకోవాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. అక్రమ కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో కాకాణి మంగళవారం ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా కాకాణి మీడియాతో మాట్లాడుతూ నాలుగు ప్రధానమైన మూలస్తంభాల ఆధారంగా ప్రజాస్వామ్య సంరక్షణకు అంబేడ్కర్ రాజ్యాంగం రచిస్తే, చంద్రబాబు.. ఆయన తనయుడు నారా వారి రెడ్ బుక్‌తో నాలుగు వ్యవస్థలను ఏర్పరచుకుని రాష్ట్రాన్ని ఏలుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీలో ఎవరి మీద కేసులు పెట్టాలి, ఎటువంటి కేసులు పెట్టాలి. జైల్లో పెట్టి ఎన్ని రోజులు ఉంచాలి, అనుకూల మీడియాతో ప్రజల్లోకి ఎలా తప్పుడు సంకేతాలు పంపాలనే నాలుగింటిపై పాలన జరుగుతోందన్నారు. మీరు చేస్తున్న ఈ పనుల వల్ల మీ శాడిజాన్ని తీర్చుకోగలరేమో కానీ మిథున్‌రెడ్డి వ్యక్తిత్వాన్ని, మానసిక స్థైర్యాన్ని దెబ్బ తీయలేరన్నారు. తనపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి 86 రోజులు జైలులో పెట్టి నిర్బంధించిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునే వరకు మమ్మల్ని ఆపలేరన్నారు. రెండో విడత జగనన్న 2.0 చూడబోతున్నారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడైనా రైతులు యూరియా, విత్తనాల కోసం రోడ్డు ఎక్కిన పరిస్థితులు ఏర్పడ్డాయా అన్నారు. చంద్రబాబు తెచ్చిన లక్షల టన్నుల యూరియా రైతులకు అందకుండా ఏమైందన్నారు. యూరియా బ్లాక్ లో అమ్ముకోవడానికి రూ.250 కోట్లు చేతులు మారాయన్నారు. ఈ నెల 19వ తేదీ వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా పిలుపుమేరకు రాష్ట్రంలోని 17 మెడికల్ కాలేజీల వద్ద ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కాటసాని రామ్‌గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో రెడ్‌బుక్ రాజ్యాంగంలో ఏ నాయకుడి మీదైనా కేసు పెట్టొచ్చన్నారు. ఈ విధమైన పరిపాలన, పోలీసు వ్యవస్థలను తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో మొట్టమొదటిసారి చూస్తున్నానన్నారు. గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ ఆధారాలు లేని అభియోగాలు మోపి జైల్లో పెట్టారని మిథున్‌రెడ్డి చెబుతున్నారన్నారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న పనులన్నీ జగనన్న వేసిన పునాదిపై సాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో పేద ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో జగనన్న 17 కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

పంటకాలువలో గుర్తుతెలియని మృతదేహం

అమలాపురం రూరల్: మండలంలోని తాండవపల్లి పరిధి శెట్టిపల్లి పంట కాలువలో గుర్తుతెలియని మృతదేహాన్ని తాలూకా పోలీసులు గుర్తించారు. కాలువలో కొట్టుకువచ్చిన పురుషుడి మృతదేహం వనువులమ్మ గుడి సమీపాన అడ్డుపడింది. దాంతో స్థానికులు ఈ విషయాన్ని తాలూకా ఎస్సై శేఖర్ బాబుకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి ఎస్సై చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు వయస్సు 25 నుంచి 30 ఉండవచ్చని, చనిపోయి మూడు రోజులు కావచ్చన్నారు. వీఆర్వో ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. శవం ఉబ్బి ఉందని శవంపై తెలుపు, నీలంరంగు గళ్ల ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, నలుపురంగు జీన్స్, కుడి చేతిమీద దీపిక అని పచ్చబొట్టు ఉందని, చొక్కా కాలర్‌పై శ్రీకాంత్ టైలర్స్ అమలాపురం అని లేబుల్ ఉందన్నారు. మృతదేహం ఆచూకీ తెలిసిన వారు వెంటనే అమలాపురం తాలూకా ఎస్సై సెల్ నంబర్ 9440796562 లేదా రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్ సెల్ నంబర్ 9440796525ను సంప్రదించాలన్నారు.

ఎస్‌జీఎఫ్‌ఐ ఎంపికలు వాయిదా

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17 ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాలలో జరగనున్న ఎస్‌జీఎఫ్‌ఐ అండర్–14, 17 బాలికల ఎంపికలు వాయిదా వేసినట్లు సమాఖ్య కార్యదర్శి ఏవీడీ ప్రసాదరావు మంగళవారం తెలిపారు. అమరావతికి 19వ తేదీన 400 మంది పీడీ, పీఈటీలకు ఆన్‌లైన్ డ్యూటీ ఉన్నందున షెడ్యూలు వాయిదా వేశామన్నారు. ఈ షెడ్యూలు 21వ తేదీ ఆదివారం పూర్తి చేస్తామన్నారు.

ఆర్టీసీ కండక్టర్‌పై ప్రయాణికుడి దాడి



ప్రయాణికుడి దాడిలో గాయపడిన కండక్టర్ పాండురంగ

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు కండక్టర్‌పై ఓ ప్రయాణికుడు దాడికి దిగడంతో చేతి వేలు విరిగి ఆస్పత్రి పాలయ్యాడు. వివరాల ప్రకారం గోకవరం డిపోకు చెందిన సింగిల్ స్టాప్ రాజమహేంద్రవరంలోని గోకవరం బస్టాండ్ నుంచి 67 మంది ప్రయాణికులతో మధ్యాహ్నం 2.20 గంటల సమయంలో గోకవరం బయలుదేరింది. గోకవరానికి చెందిన ఓ ప్రయాణికుడు రూ.105 ఇచ్చి టికెట్ కొనుగోలు చేయగా కండక్టర్ గరగా పాండురంగ టికెట్ ఇచ్చి మిగిలిన చిల్లర రూ.60 తిరిగి ఇచ్చాడు. ఈ క్రమంలో రూ.50 నోటు బాగా లేదని సదరు ప్రయాణికుడు కండక్టర్‌పై దాడికి దిగడంతో కండక్టర్ వేలికి తీవ్ర గాయమైంది. దీంతో డ్రైవర్ బస్సుని గోకవరం పోలీస్‌స్టేషన్ వద్ద ఆపి ప్రయాణికుడు రామకృష్ణపై ఫిర్యాదు చేశారు. అనంతరం కండక్టర్‌ని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎక్స్‌రే తీయగా చేతి వేలు విరిగిపోయిందని శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించారు. ఈ సంఘటనతో ఆర్టీసీ సిబ్బంది తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ సిబ్బంది భారీ సంఖ్యలో పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని కండక్టర్‌ని గాయపరిచిన ప్రయాణికుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై డిపో మేనేజర్ సుచరిత మార్గరెట్‌ని సంప్రదించగా సిబ్బందిపై దాడి ఘటన దురదృష్టకరమన్నారు.

13 రోజుల తరువాత చేరిన మృతదేహం



రాపాక విజయ భారతి (ఫైల్)

మలికిపురం: ఉపాధి కోసం నాలుగేళ్ల క్రితం గల్ఫ్ దేశమైన దుబాయికి వెళ్లిన రామరాజులంక గ్రామానికి చెందిన రాపాక విజయభారతి ఈ నెల 3న దుబాయ్‌లో అనారోగ్యంతో మృతి చెందింది. 13 రోజుల తరువాత మంగళవారం ఆమె మృతదేహం స్వగ్రామానికి చేరింది. దుబాయ్‌లోని సమీప బంధువులు, అడ్వకేట్ నల్లి శంకర్ కృషితో తగిన విదేశీ ఫార్మాలిటీస్ పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని అప్పగించడంతో గ్రామంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, నల్లి శివకుమార్ తదితరులు ఆమె మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

అంతర్ జిల్లాల మోటార్‌సైకిల్ దొంగల అరెస్ట్

26 వాహనాల స్వాధీనం



సర్పవరం పోలీసులు అరెస్ట్ చేసిన బైక్ దొంగ. చిత్రంలో స్వాధీనం చేసుకున్న బైక్‌లు



పెరవలి పోలీస్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

పెరవలి: ఇళ్ల వద్ద ఉన్న మోటార్ సైకిళ్లను దొంగిలించడంలో ఆరితేరిన అంతర్ జిల్లాల నేరస్తులను పోలీసులు ఎంతో చాకచక్యంగా పట్టుకున్నారు. తూర్పు, పశ్చిమ, కాకినాడ, విశాఖ, కోనసీమ జిల్లాల్లో దొంగిలించిన 26 మోటార్ సైకిళ్లను దొంగల నుంచి పోలీసులు రికవరీ చేసి వారిని అరెస్ట్ చేశారు. కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ పెరవలి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలోనే కాక చుట్టుపక్కల జిల్లాల్లో 26 మోటార్ సైకిళ్లను దొంగిలించారని వీటి విలువ రూ.40 లక్షలని తెలిపారు. ఈ దొంగతనాలకు పాల్పడిన యువకులు పెరవలి మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన తుమ్మగంటి ధనుష్, నెక్కంటి యువరాజు, వనచర్ల రాజు, కూనపురెడ్డి వీరబాబు ఉండగా, కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామానికి చెందిన విశ్వనాథుల దేవిశ్రీ ప్రసాద్, అబ్బిరెడ్డి పాపారావు ఉన్నారన్నారు. ఈ దొంగతనాల్లో ప్రధాన నిందితులు తుమ్మగంటి ధనుష్, విశ్వనాథుల దేవిశ్రీ ప్రసాద్‌లని తెలిపారు. ప్రస్తుతం ఐదుగురుని అదుపులోకి తీసుకున్నామని విశ్వనాథుల దేవిశ్రీప్రసాద్ పరారీలో ఉన్నాడని ఇతన్ని పట్టుకోవడానికి ప్రత్యేక టీమ్‌లు తిరుగుతున్నారని చెప్పారు. మోటార్ సైకిళ్ల చోరీ కేసులో పెరవలి, కొవ్వూరు, నిడదవోలు పోలీసులు ఎంతో చాకచక్యంగా నేరస్తులను పట్టుకుని వారి నుంచి 26 మోటార్‌సైకిళ్ల రికవరీ చేయడం జరిగిందన్నారు. దొంగతనాలకు పాల్పడిన నిందితులను పట్టుకున్న పెరవలి ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు, ట్రైనీ ఎస్సై కె.సౌజన్యను అభినందించారు. ఈ కేసును త్వరితగతిన చేధించడానికి కారణమైన పోలీసు సిబ్బందిని అభినందిస్తూ వారికి రివార్డులు ప్రకటించారు. కార్యక్రమంలో సీఐ పీవీజీ తిలక్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పవరంలో ఒకరి అరెస్టు..

కాకినాడ రూరల్: సర్పవరం పోలీసులకు మోటారు సైకిళ్ల దొంగ పట్టుబడ్డాడు. 20 ఏళ్ల వయసులోనే చాకచక్యంగా బైక్‌ల చోరీల్లో ఆరితేరాడు. సామర్లకోట మండలం పండ్రవాడకు చెందిన పెంకే తేజను సోమవారం నిందితుడిని సర్పవరం పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి వివరాలను ఎస్సై శ్రీనివాస్‌కుమార్ మంగళవారం మీడియాకు తెలియజేశారు. నిందితుడి నుంచి రూ.6.5 లక్షల విలువైన 11 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన క్రైమ్ సిబ్బంది హెచ్‌సీలు సత్తిబాబు, రాజు, గణేష్, పీసీలు రవి, శ్రీనివాస్, అనిల్, చిన్నబాబు, కిశోర్‌లను సీఐ పెద్దిరాజు అభినందించారు.

రైలు ప్రమాదంలో కాళ్లు పోగొట్టుకున్న విద్యార్థి

తుని: రైలు నుంచి జారిపడి బీటెక్ విద్యార్థి తన రెండు కాళ్లు పోగొట్టుకున్నాడు. వివరాల్లోకెళితే.. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం వెంకటాపురానికి చెందిన గరికిన హేమరాజు సూరంపాలెంలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. రోజూ తుని నుంచి సామర్లకోట వరకూ ట్రైన్‌లో వెళ్లి అక్కడ నుంచి కాలేజీకి వెళ్తుంటాడు. రోజూ మాదిరిగానే మంగళవారం జన్మభూమి ట్రైన్ ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తూ ట్రైన్ నుంచి జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో హేమరాజు రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. రైల్వే పోలీసులు తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై స్థానిక జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.